
సాక్షి
గుంటూరు
ఆదివారం । 27 । ఏప్రిల్ । 2025



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 514.50 అడుగుల వద్ద ఉంది. ఇది 139.4380 టీఎంసీలకు సమానం.



రెడ్డి పేరంటాలమ్మకు పూజలు

నాదెండ్ల: సాతులూరులోని రెడ్డి పేరంటాలమ్మ ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. గత నెల 17న ఈ ఆలయాన్ని రూ.3 కోట్ల వ్యయంతో నిర్మించి ప్రతిష్ఠ నిర్వహించారు.

ప్రిన్సిపల్ జడ్జిని కలిసిన కలెక్టర్



నరసరావుపేట: స్థానిక కోర్టు ప్రాంగణానికి శనివారం విచ్చేసిన గుంటూరు జిల్లా ప్రిన్సిపల్ జడ్జి సాయికల్యాణ చక్రవర్తిని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు మర్యాద పూర్వకంగా కలిశారు.

న్యూస్‌రీల్

అద్దంకమ్మ అమ్మవారి తిరునాళ్ల



ప్రత్తిపాడు: వట్టిచెరుకూరులో అద్దంకమ్మ అమ్మవారి తిరునాళ్ల ఉత్సవాలు నేత్ర పర్వంగా జరుగుతున్నాయి. ఈ నెల 23 నుంచి మొదలైన ఉత్సవాల్లో తొలి రోజు మారెమ్మ కొలుపు, మర్నాడు పోలేరమ్మ కొలుపులు నిర్వహించారు. శనివారం కుంకుమ బండ్లతో ఊరేగింపు చేపట్టారు. తిరునాళ్ల సందర్భంగా అమ్మవారి దేవస్థానం విద్యుత్ దీపాలతో ధగధగలాడుతుంది. స్థానికులు ఏర్పాటు చేసిన భారీ విద్యుత్ ప్రభలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

ఉత్తీర్ణత పెంపునకు చర్యలు

'దూరవిద్యలో ఉత్తీర్ణత దూరం' కథనంపై స్పందించిన డీఈఓ



దూరవిద్యలో ఉత్తీర్ణత దూరం

సాక్షి ఎఫెక్ట్

గుంటూరు ఎడ్యుకేషన్: 'దూరవిద్యలో ఉత్తీర్ణత దూరం' శీర్షికతో 'సాక్షి' జిల్లా టాబ్లాయిడ్‌లో శనివారం ప్రచురితమైన కథనానికి జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక స్పందించారు. గుంటూరు జిల్లాలో పరీక్షలు రాసిన 939 మంది అభ్యర్థుల్లో కేవలం 55 మంది ఉత్తీర్ణులై, 5.86 శాతం ఉత్తీర్ణత నమోదు కావడాన్ని తీవ్రంగా పరిగణించారు. దూరవిద్య టెన్త్ పరీక్షల్లో తప్పిన విద్యార్థులకు ఓపెన్ స్కూల్ కో–ఆర్డినేటర్లు వేసవి సెలవుల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించి, సప్లిమెంటరీ పరీక్షలకు సన్నద్ధం చేసేలా, తద్వారా ఉత్తీర్ణతా శాతాన్ని గణనీయంగా పెంచేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

30న పాలిసెట్

గుంటూరు నగరంలో 11 పరీక్షా కేంద్రాలు

గుంటూరు ఎడ్యుకేషన్ : పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశం కోసం ఉద్దేశించిన పాలిసెట్–2025 ఈనెల 30న జరగనుంది. పాలిసెట్‌కు జిల్లా వ్యాప్తంగా దరఖాస్తు చేసిన 4,030 మంది విద్యార్థులకు గుంటూరు నగరంలో 11 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరగనుండగా, విద్యార్థులు కనీసం గంట ముందుగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంది. ఉదయం 11 గంటల తరువాత నిముషం ఆలస్యమైనా విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించబోమని అధికారులు ప్రకటించారు. వేసవి దృష్ట్యా పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, ఫర్నిచర్ తదితర మౌలిక వసతులు కల్పించామని సెట్ సమన్వయకర్త, నల్లపాడు ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ టి. శేఖర్ తెలిపారు.

టీచర్లకు మెడికల్ సర్టిఫికెట్లు అందజేత



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో ఉపాధ్యాయుల బదిలీల కోసం వైద్య ధృవీకరణ ప్రక్రియ 24 నుంచి ప్రారంభమైంది. ఇందుకుగాను జీజీహెచ్ సిబ్బందితో మెడికల్ బోర్డు ఏర్పాటు చేసి లాజిస్టిక్స్ కమిటీ ద్వారా అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో దాదాపు 710 మంది టీచర్లకు వైద్య పరీక్షలు నిర్వహించగా శనివారం 200 మందికి వైద్య ధృవీకరణ పత్రాలు అందజేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ చేతుల మీదుగా డీఈఓ కార్యాలయం వారికి అందజేశారు. కార్యక్రమంలో జీజీహెచ్ మినిస్ట్రీయల్ స్టాఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ సెక్రటరీ నాగరాజు, మెడికల్ రికార్డ్స్ అధికారి రామారావు, జి.కార్తీక్, జీజీహెచ్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీల రాష్ట్ర సదస్సు

నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్) : ఏపీ స్టేట్ వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి అడ్మిన్ సెక్రటరీల సమావేశం గుంటూరు నగరంలోని ఏపీ ఎన్జీవో కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఓర్సు రామకృష్ణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశంలో అడ్మిన్ సెక్రటరీల సమస్యలు, పదోన్నతుల విషయంపై చర్చించనున్నారు.

గ్రంథాలయ పునరుజ్జీవ ఉద్యమం

గ్రంథాలయోద్యమ స్ఫూర్తికి నేడు తూట్లు

- నాడు విజయవాడ కేంద్రంగా గ్రంథాలయ ఉద్యమం
- ఆ స్ఫూర్తితో ఊరూరా వెలిసిన గ్రంథాలయాలు
- స్వాతంత్ర్యానంతరం తగ్గిన ప్రాభవం.. నేడు మరీ తీసికట్టు
- నేడు ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ రాష్ట్ర సదస్సు



తెనాలి: దేశ ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక మేధోవికాసానికి గ్రంథాలయాలు తోడ్పడతాయి. గ్రంథాలయోద్యమం స్వాతంత్ర్య ఉద్యమంలో నిర్వహించిన పాత్ర చారిత్రాత్మకం. ప్రస్తుతం అనేక కారణాలతో గ్రంథాలయ వ్యవస్థ ఆదరణ కోల్పోతోంది. దీనిని పునరుజ్జీవింపజేయడం ప్రభుత్వ బాధ్యత. సంరక్షించుకోవటం ప్రజల బాధ్యత. ఈ నినాదంతోనే ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పునర్వికాస ఉద్యమానికి అంకురార్పణ జరిగింది. ఉద్యమ రాష్ట్ర సదస్సు ఈనెల 27న విజయవాడ గవర్నర్‌పేట లోని ఎంబీ విజ్ఞానకేంద్రంలో జరగనుంది. ఈ సందర్భంగా విజయవాడ కేంద్రంగా జరిగిన గ్రంథాలయ ఉద్యమం, చరిత్రను తెలుసుకుందాం.

1914లోనే అంకురార్పణ

గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య సారథ్యంలో 1914లో ఆంధ్ర దేశ గ్రంథాలయ సంఘం ఏర్పడింది. అప్పట్లో రాష్ట్రంలో 200 గ్రంథాలయాలు నడుస్తుండేవి. ఏప్రిల్ 11, 12 తేదీల్లో విజయవాడలో జరిగిన ఆంధ్ర మహాజన సభకు రాష్ట్రంలోని 60 గ్రంథాలయాల నుంచి 200 మందికి పైగా హాజరయ్యారు. సభాధ్యక్షుడు చిలకమర్తి లక్ష్మీనరసింహం, మోచర్ల రామచంద్రరావు అధ్యక్షులుగా అయ్యంకి వెంకటరమణయ్య, నాళం కృష్ణారావు కార్యదర్శులుగా ఆంధ్ర దేశ గ్రంథ భాండాగార సంఘం ఏర్పడింది. ఇదే సంఘం 1916లో ఆంధ్ర దేశ గ్రంథాలయ సంఘంగా, 1956 నుంచి ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘంగా రూపుదిద్దుకుంది. గ్రంథాలయాల ఆవశ్యకతపై ఊరూరా సభలు, చర్చలు జరిపారు. యువకులు వందలాది గ్రంథాలయాలను స్థాపించారు. మరోవైపు సభలు, సమావేశాలు, యాత్రలతో 1920 నాటికి వందల సంఖ్యలో గ్రంథాలయాలు వెలిశాయి.

మూడంచెల వ్యవస్థగా..

క్రమబద్ధమైన గ్రంథాలయ వ్యవస్థ నిర్వహణకు తగిన చట్టం కోసమని ఆంధ్ర దేశ గ్రంథాలయ సంఘం 1948 జనవరి 16న విజయవాడలో మహాసభ జరిపింది. గాడిచర్ల హరిసర్వోత్తమరావు అధ్యక్షుడు. 1950 నుంచి ఆంధ్రప్రాంతంలో మద్రాస్ పౌర గ్రంథాలయ చట్టం అమల్లోకి వచ్చింది. ఇదే నమూనాలో 1955లో హైదరాబాద్ పౌర గ్రంథాలయ చట్టం, 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డాక 1960 నుంచి ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ చట్టం ఆమోదం పొందింది. మూడంచెల గ్రంథాలయ వ్యవస్థ అంటే ప్రభుత్వ గ్రంథాలయాలు, జిల్లా గ్రంథాలయ సంస్థల గ్రంథాలయాలు, స్థానిక సంస్థల, ఇతర స్వచ్ఛంద గ్రంథాలయాలు ఏర్పడ్డాయి. వీటి నిర్వహణకు జిల్లా గ్రంథాలయ సంస్థలు వచ్చాయి. జిల్లా కేంద్ర గ్రంథాలయాలు, 5వేల జనాభాకు మించిన పట్టణాల్లో, గ్రామాల్లో వీలున్నంతవరకు శాఖా గ్రంథాలయాలు నెలకొల్పారు. వెయ్యి జనాభాకు పైబడిన గ్రామాల్లో పుస్తక పంపిణీ కేంద్రాలను తీసుకొచ్చారు. 2011–12 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 22 జిల్లా కేంద్ర గ్రంథాలయాలు, ఒక నగర కేంద్ర గ్రంథాలయం, 1450 శాఖా గ్రంథాలయాలు, 400 గ్రామీణ గ్రంథాలయాలు, 600 పుస్తక పంపిణీ కేంద్రాలు పనిచేస్తున్నాయి. తర్వాత కొన్ని మండలాల్లో 634 శాఖాగ్రంథాలయాలు, ప్రతి జిల్లాకు మూడు చొప్పున మరో 69 గ్రంథాలయాలను స్థాపించారు.

నేడు నామమాత్రం

గ్రంథాలయ చట్టం ప్రకారం మున్సిపాలిటీలు, పంచాయతీలు ప్రజల్నుంచి వసూలుచేసే ఇంటిపన్నులో రూపాయికి ఎనిమిది పైసలు వంతున సెస్సు రూపంలో వసూలుచేసి గ్రంథాలయ నిధికి ఇవ్వాలి. ఈ నిధి నుంచే జిల్లా గ్రంథాలయ సంస్థలు తమ అధీనంలోని గ్రంథాలయాలను నిర్వహిస్తుంటాయి. రాష్ట్ర ప్రభుత్వం గ్రాంట్ ఇన్ ఎయిడ్ పద్ధతిలో పూర్తికాలపు సిబ్బంది జీతభత్యాలను భరిస్తుంది. 1975 నుంచి వచ్చిన ఈ మార్పుతో జిల్లా గ్రంథాలయ సంస్థలు కాస్త స్థిరపడ్డాయి. అయితే 1986 తర్వాత శాఖాగ్రంథాలయాల స్థాపన జరగలేదు. స్థానిక సంస్థలు సెస్సు జమచేయక పోవటం, ఉద్యోగులకు జీతాల చెల్లింపులో జాప్యం, కొత్త పుస్తకాలు లేక, పఠనం తగ్గిపోవటంతో గ్రంథాలయాలు నామమాత్రంగా పనిచేస్తున్నాయి.

గ్రంథాలయాలను పరిరక్షించుకోవాలి




సాహిత్య, సాంస్కృతిక, రాజకీయ, మానసిక వికాసానికి తోడ్పడుతున్న గ్రంథాలయాలు కనీస సౌకర్యాలు లేక దీనావస్థలో ఉన్నాయి. వాటిని పరిరక్షించుకోవాలి. దక్షిణాదిలోని రాష్ట్రాలు గ్రంథాలయాల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడుతుంటే, తెలుగు రాష్ట్రాల్లో అందుకు భిన్నంగా జీర్ణావస్థలో ఉన్నాయి. కర్ణాటకలో ఆరువేల గ్రంథాలయాలుంటే, ఇటీవల మరో నాలుగు వేల గ్రంథాలయాలను ప్రారంభించారు. గ్రంథాలయాలకు రూ.2 లక్షల చొప్పున పుస్తకాలకు కేటాయించారు. 47 లక్షలమంది పిల్లలను సభ్యులుగా చేర్చారు. పాఠశాలల్లో పిల్లలు పుస్తకాల చదువుకు ప్రత్యేకంగా గంట కేటాయించారు. మన రాష్ట్రంలో ఉన్నవి కేవలం 1400 మాత్రమే. అవికూడా దీనావస్థలో ఉన్నాయి.

– వల్లూరు శివప్రసాద్,
ఉద్యమ వేదిక కన్వీనర్

బోటు గ్రంథాలయాలు

గ్రంథాలయ వ్యవస్థలోని యువజనులకు ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు ఆర్థికసాయంతో 1920లో విజయవాడలో శిక్షణ శిబిరం నిర్వహించింది. కాశీనాథుని నాగేశ్వరరావు, కొండా వెంకటప్పయ్య, ఉన్నవ లక్ష్మీనారాయణ, భోగరాజు పట్టాభి సీతారామయ్య, వేమవరపు రామదాసు పంతులు, చిలుకూరు వీరభద్రరావు, రాయప్రోలు సుబ్బారావు, అయ్యదేవర కాళేశ్వరరావు, సూరి వెంకటనరసింహం తదితరులు అధ్యాపకులుగా వ్యవహరించారు. తర్వాత వివిధ ప్రాంతాల్లో శిక్షణ తరగతులు జరిపారు. వీటిలో బోటు యాత్రలూ ఉన్నాయి. ఇది స్ఫూర్తిగా పాతూరి నాగభూషణం తెనాలి తాలూకాలోని పెదపాలెం సేవాశ్రమ వాణీమందిరం తరఫున 1935లో బకింగ్‌హాం కెనాల్ బ్రాంచి కాల్వపై కొంతకాలం బోటు గ్రంథాలయం నడిపారు. పెదవడ్లపూడి – కొల్లూరు మధ్య, వడ్లపూడి – పిడపర్రు మధ్య, సంగంజాగర్లమూడిలో మద్రాస్ కాల్వపై బోటు గ్రంథాలయం నిర్వహించారు. మద్రాస్ ప్రభుత్వ ఎగ్జిక్యూటివ్ మెంబర్ పీఎస్ శివసామయ్యర్, స్థానిక సంస్థలు స్వయంగా గ్రంథాలయాలను ప్రారంభించటం, తమ నిధుల నుంచి రిజిస్టరై స్వచ్ఛందంగా నిర్వహించే గ్రంథాలయాలకు గ్రాంటు మంజూరుకు అవకాశం కల్పించారు.



1947 తర్వాత మసకబారిన ఉద్యమం



తెనాలిలోని శాఖా గ్రంథాలయం

స్వాతంత్ర్యం వచ్చేనాటికి రాష్ట్రంలో వేలసంఖ్యలో గ్రంథాలయాలు వెలిశాయి. నగరపాలక, పురపాలక సంఘాలు, పంచాయతీలు, సహకార సంఘాలు, స్వచ్ఛంద సంఘాలు, కులసంఘాల ద్వారా అవి పనిచేశాయి. ఫిర్కా అభివృద్ధి ప్రణాళికతో మరికొన్ని వచ్చాయి. పుస్తకాలు, పత్రికలను చదువరులకు అందుబాటులో ఉంచటమే కాకుండా ప్రజాఉద్యమాలకు కేంద్రంగానూ పనిచేశాయి. 1947 తర్వాత ఉద్యమం మసకబారింది. మహోజ్వలంగా సాగిన ఉద్యమం ఒక ప్రభుత్వశాఖగా మారి తన పరిధిని తగ్గించుకుంది.

అల వైకుంఠపురంలో...
శ్రీవారి ఆదాయానికి గండి



వైకుంఠపురం దేవస్థానం

- వేలం టెండర్లలో గోల్‌మాల్
- రెండు షాపులకు రూ.7 లక్షల తగ్గింపు
- ఇతరులకు మాత్రం పెంపుదల
- రూ.4 లక్షలు చేతులు మారిన ఫలితం!

తెనాలి: భక్తులు చిన్న తిరుపతిగా పిలుచుకునే స్థానిక శ్రీలక్ష్మీపద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి ఆదాయానికి గండి పడింది. ఆలయంలోని వివిధ దుకాణాలకు నిర్వహించే వేలంలో అస్మదీయులపై అపార ప్రేమ చూపారు. స్వామివారికి రూ.7 లక్షల వరకు శఠగోపం పెట్టారు. బినామీల పేర్లతో లాగించేశారు. తెలుగు తమ్ముళ్ల సిఫార్సుపై చూపిన కరుణకు పనిలో పనిగా రూ.లక్షలు చేతులు మారాయి. ఇతరుల దుకాణాలకు మాత్రం రూల్స్ ప్రకారం అద్దె పెంపుదల చేశారు.

వైకుంఠపురం దేవస్థానంలోని షాపులకు గతంలో రెండేళ్ల కాలపరిమితితో నిర్వహించే వేలంపాటలను ఈమధ్య కాలంలో ఏడాదికి పరిమితం చేశారు. ఆ ప్రకారం మొత్తం తొమ్మిది షాపులు/నిర్వహణకు లైసెన్సుల కోసం ఇటీవల ఈ–ప్రొక్యూర్‌మెంట్ సీల్డ్ టెండర్ కమ్ బహిరంగ వేలం జరిపారు. గతంలో వేలంలో పాల్గొనేవారి నుంచి కొన్ని షాపులకు రూ.5 లక్షల డిపాజిట్ వసూలు చేసేవారు. ప్రస్తుత సంవత్సరానికి మాత్రం అధికారులు ఆ మొత్తాన్ని రూ.లక్షకు పరిమితం చేశారు. ఆలయ సహాయ కమిషనర్/కార్యనిర్వహణ అధికారికి ఆ విచక్షణాధికారం ఉంటుంది.

పేర్లు మాత్రమే బినామీలవి..

రూరల్ మండల గ్రామానికి చెందిన ఓ తెలుగు తమ్ముడి సిఫార్సుతోనే స్వామివారి ఆదాయాన్ని తగ్గించి షాపుల నిర్వాహకులకు లాభం చేకూర్చారని ఆలయ వర్గాలు చెప్పుకుంటున్నాయి. ఇంతకు ముందు షాపులు నిర్వహించిన యజమానుల పేరిట తగ్గింపు ధరకు పాట రాస్తే, నిబంధనలు అంగీకరించవు...దీనిని దృష్టిలో ఉంచుకుని బినామీ పేర్లతో లాగించేశారని చెబుతున్నారు. ఆ బినామీలు కూడా ఆయా షాపుల నిర్వాహకుల సమీప బంధువులే కావటం గమనించాల్సిన అంశం. పేర్లు మాత్రం బినామీలవి. షాపుల నిర్వహణ మాత్రం పాత అద్దెదారులే చేస్తున్నారు. అద్దె తగ్గించిన షాపులలో ఒక్కో షాపును ఇద్దరేసి నిర్వహిస్తున్నారు. చెరిసగం వార్షిక అద్దెను భరిస్తున్నారు. ఇది అందరికీ తెలిసిన నిజం. ఇప్పుడు షాపు అద్దె మొత్తాన్ని వేలంలో తగ్గించినందున అధికారులకు ఇవ్వటానికని చెప్పి, మొదటి షాపుకు చెందిన ఇద్దరి నుంచి రూ.రెండేసి లక్షలు చొప్పున రూ.4 లక్షలు వసూలు చేశాడో మధ్యవర్తిగా చెప్పుకునే వ్యక్తి. మరో షాపు నిర్వహించుకుంటున్న ఇద్దరి నుంచి చెరొక రూ.75 వేల వంతున రూ.1.50 లక్షలను తీసుకున్నాడు. అవి అధికారులకు ముట్టాయో లేదో తెలీదు. 'లాభం లేకుండా స్వామివారి ఆదాయానికి మాత్రం ఎలా గండికొడతారు' అని ఎవరికి వారు ప్రశ్నించుకుంటున్నారు. ఇదే విషయమై వివరణ కోరేందుకు ప్రయత్నించగా, కార్యనిర్వహణాధికారి వి.అనుపమ అందుబాటులో లేరు.

ప్రధాన షాపులకు తగ్గింపు ..

దేవదాయశాఖ నిబంధనల ప్రకారం షాపులకు వేలం జరిపిన ప్రతిసారీ నిర్ణీత అద్దె మొత్తం పెంపుదల జరగాల్సిందే. వైకుంఠపురంలోని మొత్తం తొమ్మిదింటికి ఏడు షాపులకు అద్దె మొత్తాన్ని పెంపుదల చేశారు. ప్రధానమైన రెండింటికి మాత్రం తగ్గించేయటమే ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. కొబ్బరికాయలు, పూజాద్రవ్యాలు అమ్ముకొనే లైసెన్సు హక్కు గతేడాది రూ.13 లక్షలు ఉండగా 2025–26 సంవత్సరానికి రూ.8.11 లక్షలకు పరిమితం చేసినట్టు విశ్వసనీయ సమాచారం. ఫాన్సీ, బొమ్మలు అమ్ముకునే లైసెన్సు హక్కు గత సంవత్సరం రూ.7.50 లక్షలు కాగా, ఈసారి రూ.5.50 లక్షలకు తగ్గించేశారు. అంటే కేవలం రెండు షాపులపై శ్రీవారి వార్షిక ఆదాయానికి రూ.7 లక్షల వరకు గండిపడింది.

ప్రధాని పర్యటన విజయవంతం చేద్దాం

ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి నాదెండ్ల మనోహర్, కలెక్టర్



ప్రధాని పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

తాడికొండ: అమరావతి రాజధాని నిర్మాణ పనులను పునఃప్రారంభించేందుకు భారత ప్రధాని నరేంద్ర మోదీ మే 2వ తేదీన అమరావతి రానున్న నేపథ్యంలో అక్కడి ఏర్పాట్లను శనివారం రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ప్రధాని పర్యటన ఏర్పాట్ల పర్యవేక్షణ నోడల్ అధికారి వీరపాండియన్, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, సంయుక్త కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ, ఆర్‌డీఓ కె. శ్రీనివాసరావులు పరిశీలించి అధికారులకు సూచనలు, సలహాలు అందించారు. మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనకు సుమారు 4 నుంచి 5 లక్షల మంది ప్రజలు ఆరు జిల్లాల నుంచి తరలివస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా భావిస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. సభకు సీఆర్డీఏ పరిధిలోని 120 ఎకరాలు కేటాయించుకుని ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు 75 శాతం పనులు పూర్తి అయ్యాయని, 29వ తేదీ నుంచి ఎస్పీజి సిబ్బంది వచ్చిన తరువాత వారి ఆధ్వర్యంలో మిగిలిన ఏర్పాట్లు పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. వాహనాల రాకపోకలకు నాలుగు ప్రధాన రహదారులు వున్నాయని, హైవే నుంచి వచ్చే వాహనాలకు సీడ్ యాక్సెస్ రోడ్డు, అలాగే వెస్ట్రన్ బైపాస్ రోడ్డును కూడా ఉపయోగించుకోవాలని సూచించారు. కృష్ణ, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు జిల్లాల నుంచి ఎక్కువ మంది వస్తారన్నారు. తాగునీరు, ఆహారం, మరుగుదొడ్లు వంటి వసతులు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

కూటమి మేయర్ అభ్యర్థిగా కోవెలమూడి రవీంద్ర



నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్) : గుంటూరు నగరపాలక సంస్థ మేయర్ అభ్యర్థిగా కోవెలమూడి రవీంద్రను కూటమి ఎంపిక చేసింది. ఈ మేరకు శనివారం పార్టీ గుంటూరు పార్లమెంటరీ అధ్యక్షులు, తాడికొండ ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్, జనసేన జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావులు కలిసి ఆయనకు బి.ఫారం అందజేశారు.

బుద్ధిస్ట్ సర్క్యూట్ వద్ద అగ్ని ప్రమాదం

అమరావతి: అమరావతిలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో బుద్ధ విగ్రహం ఎదురుగా బుద్ధిస్ట్ సర్క్యూట్ భవనాల వద్ద శనివారం అగ్నిప్రమాదం జరిగింది. ఓ ప్రైవేటు ఊరేగింపులో కాల్చిన బాణసంచా రవ్వలు బుద్ధిస్ట్ సర్క్యూట్ భవనాల సమీపంలో ఉన్న చెత్తలో పడి రాజుకుని మంటలు చెలరేగాయి. ఇది గమనించిన స్థానికులు మంటలు ఆర్పటానికి ప్రయత్నించినా సాధ్యపడలేదు. ఈ క్రమంలో సత్తెనపల్లి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వటంతో అగ్నిమాపక వాహనంతో సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలు అదుపులోకి తెచ్చారు.

జిల్లా వ్యాప్తంగా జల్లెడ

రైల్వే స్టేషన్, బస్టాండ్, లాడ్జిల్లో పోలీసుల తనిఖీలు

నగరంపాలెం (గుంటూరు వెస్ట్) : జిల్లాలో సంఘవిద్రోహ కార్యకలాపాల నియంత్రణకు భద్రతా బలగాలు విస్తృత తనిఖీలు నిర్వహించాయి. ఇటీవల జమ్మూ కశ్మీర్ పహల్గాంలో ఉగ్రవాదుల జరిపిన కాల్పుల దృష్ట్యా జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు శనివారం సాయంత్రం జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలోని పలుచోట్ల సోదాలు చేపట్టారు. ఈ మేరకు డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, భద్రతా బలగాల సిబ్బందితో బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్‌లు, ఆటో స్టాండ్‌లు, మార్కెట్లు, జన సంచారంతో రద్దీగా ఉండే ప్రదేశాల్లో సాంకేతిక పరికరాలతో అనుమానితుల వేలిముద్రలు పరిశీలించారు. అనుమానితులు, పాత నేరస్తులు, సంబంధం లేని వ్యక్తులు ఎవరైనా ఉన్నారా, ఎక్కడ్నుంచి వచ్చారు, ఎక్కడికెళ్తున్నారు, ఏయే పనుల కోసం ఎవరెవర్ని కలుస్తున్నారనే కోణాల్లో విచారించారు. లాడ్జిలు, హోటళ్లు, డార్మెట్రి లు, అతిథి గృహాల్లోనూ తనిఖీలు కొనసాగాయి. ప్రధాన కూడళ్లు, అంతర్ జిల్లా చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు నిర్వహించారు. జిల్లాలో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే స్థానిక పోలీసులకు లేదా 112 నంబర్ ద్వారా పోలీస్ కంట్రోల్ రూంకు సమాచారం అందించాలని జిల్లాలోని ప్రజలకు సూచించారు.

పోలీసుల అదుపులో బంగ్లాదేశీయుడు...?

పట్నంబజారు : గుంటూరు పోలీసుల అదుపులో ఓ బంగ్లా దేశీయుడు ఉన్నట్లు తెలుస్తుంది. శనివారం నగరంలో పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. ఎత్తు రోడ్డు సెంటర్‌లోని ఓ హోటల్ గదిలో బంగ్లాదేశ్‌కు చెందిన ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ వ్యక్తి మిర్చి వ్యాపారం పనిపై వచ్చినట్లు సమాచారం. అయితే ఇది వాస్తవమా, కాదా అనే అంశాలను పరిశీలిస్తున్నట్టు తెలిసింది.



గుంటూరు బస్టాండ్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శనివారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **6,800** గరిష్ఠం : రూ. **9,400**

మోడల్ ధర రూ. **8,400**

క్లుప్తంగా

ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ ప్రొ.వీసీగా ప్రొఫెసర్ సతీష్ కుమార్



నీరుకొండ(మంగళగిరి) : నీరుకొండ గ్రామంలోని ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ నూతన ప్రొ.వైస్ చాన్స్‌లర్(వీసీ)గా ప్రొఫెసర్ డాక్టర్ సతీష్ కుమార్ నియమితులైనట్లు వర్సిటీ అధికారులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సిక్కిం యూనివర్సిటీ వీసీగా విధులు నిర్వహిస్తున్న సతీష్‌కుమార్ ఎస్‌ఆర్‌ఎం వర్సిటీ వీసీగా నియమించడంపై వీసీ, ప్రొఫెసర్లు అభినందనలు తెలిపారు.

మేడికొండూరులో పోక్సో కేసు

మేడికొండూరు : మేడికొండూరు పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఓ పోక్సో కేసు నమోదు అయింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం మందపాడు గ్రామానికి చెందిన గంగోలు రాజు అదే గ్రామంలో నాలుగేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు 52 ఏళ్ల గంగోలు రాజుపై పోక్సో కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు ఫీజు చెల్లించాలి

గుంటూరు ఎడ్యుకేషన్ : మే 19 నుంచి జరగనున్న టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులు ఈ నెల 30లోపు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఫీజు చెల్లించాలని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అదే విధంగా మే ఒకటవ తేదీ నుంచి రూ.50 అపరాధ రుసుంతో కలిపి మూడు సబ్జెక్టులకు రూ.110, మూడు సబ్జెక్టులకు పైన రూ.125 చొప్పున ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు చెల్లించాలని సూచించారు. రీ-కౌంటింగ్‌కు ప్రతి సబ్జెక్టుకు రూ.500, రీ-వెరిఫికేషన్‌కు ప్రతి సబ్జెక్టుకు రూ.వెయ్యి చొప్పున మే ఒకటో తేదీ లోపు హెచ్‌ఎంలకు చెల్లించాలని తెలిపారు.

ప్రకృతిలోని జీవరాశులు, పుడమి తల్లిని కాపాడుకోవాలి

నగరంపాలెం(గుంటూరు వెస్ట్) : ప్రకృతిలోని జీవరాశులు, పుడమి తల్లిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ప్రకృతి కవి జయరాజు (తెలంగాణ) అన్నారు. గుంటూరులోని కొరిటిపాడు వాకింగ్ ట్రాక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ నాగిరెడ్డి సౌజన్యంతో శనివారం ట్రాక్ ఆవరణలో చెట్టు మీద గూడు, చెట్టు కింద నీరు, ఆహారం అందించే కార్యక్రమం నిర్వహించారు. మూగ జీవులు, పక్షుల సౌకర్యార్థం గూళ్లు, తాగునీరు ఏర్పాటు చేశారు. ప్రకృతి కవి జయరాజు మాట్లాడుతూ వేసవిలో తాగునీరు, ఆహారం కోసం పక్షులు ఎంతగానో విలవిలాడతాయని అన్నారు. ప్రతి ఒక్కరూ ఇళ్లకు దగ్గరలో నీటి సౌకర్యాన్ని కల్పించాలని చెప్పారు. వాకింగ్ ట్రాక్ అధ్యక్షుడు కన్నసాని బాజీ మాట్లాడుతూ ప్రకృతిని కాపాడుకుంటే అది మన అందరిని కాపాడుతుందని అన్నారు. చెట్ల సంరక్షణ కోసం మన వంతుగా చెట్లను పరిరక్షించాలని చెప్పారు. ఏదైనా శుభ కార్యక్రమాల వేళల్లో మొక్కలు నాటాలని తెలిపారు.

కార్యక్రమంలో యోగ గురువులు సభాపతి, ధర్మారెడ్డి, ట్రాక్ కార్యదర్శి శివరామకృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడు ఇమడాబత్తిని కోటేశ్వరరావు, యేళ్ళ రత్తయ్య, వాకర్ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.



కొరిటిపాడు వాకింగ్ ట్రాక్‌లో గూడు కడుతున్న జయరాజు తదితరులు

గుర్తుకొస్తున్నాయి..!



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

గుంటూరు జేకేసీ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం

తాడేపల్లి రూరల్: గుంటూరు జేకేసీ కళాశాల పూర్వ విద్యార్థులు ఉండవల్లి కరకట్ట సమీపంలోని రిసార్ట్‌లో ఆత్మీయ సమ్మేళనం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్రా నాగేశ్వరరావు మాట్లాడుతూ గుంటూరు జేకేసీ కళాశాలలో 1989-94 బ్యాచ్ డిగ్రీ, పీజీ విద్యార్థులు ఆత్మీయంగా కలవడం ఆనందంగా ఉందని అన్నారు. పూర్వ విద్యార్థులు తాము చదువున్న రోజుల్లో జరిగిన సంఘటనలను, అనుభవాలను పంచుకున్నారు. రిటైర్డ్ లెక్చరర్ సాంబశివరావు మాట్లాడుతూ అందరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, ధ్యానం, యోగా చేయాలని సూచించారు. అనంతరం నాటి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఏలూరు సీటీఓ కోటేశ్వరరావు, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఈడీ గడ్డిపాటి అనిల్ కుమార్, పతంజలి రాష్ట్ర స్వాభిమాన్ ట్రస్ట్ రాష్ట్ర అధ్యక్షుడు జొన్నలగడ్డ శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్ట్ కాలారి నరసింహారావు, సురేష్, అమెరికన్ బ్లూ క్రాఫ్ట్స్ ఈడీ రఘు, భీమినేని వెంకటేశ్వరరావు, పీఎఫ్ వెంకటేశ్వరరావు, నాగుల్ మీరా, చైతన్య కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలత, అరుణ, స్వాతి, మువ్వా శ్రీను, ప్రసాద్, హైమా తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి విద్యుత్ శాఖ అధికారి హల్‌చల్

అమర్తలూరు(వేమూరు): విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజినీరు మద్యం తాగి హల్‌చల్ చేసిన తీరు సామాజిక మాధ్యమాలలో వైరల్ మారింది. అమర్తలూరు మండలం విద్యుత్ కార్యాలయం అసిస్టెంట్ ఇంజినీరుగా నాంచారయ్య పని చేస్తున్నారు. మూల్పూరు గ్రామంలో ప్రైవేటు కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమంలో మద్యం తాగి వ్యక్తులపై ఇష్టారాజ్యంగా మాట్లాడుతూ ప్రవర్తించిన దృశ్య రూపం ద్వారా బయటకు వచ్చింది. విద్యుత్ శాఖలో పనిచేసే సిబ్బంది 24 గంటలు విధులు నిర్వహించాల్సి ఉంది. విధుల్లో ఉన్న విద్యుత్ శాఖాధికారి ప్రవర్తన తీరుపై ప్రజలు మండిపడుతున్నారు. ఈ వీడియో జిల్లా ఉన్నతాధికారులు దృష్టికి చేరినట్లు సమాచారం.

కంపోస్టు యార్డు నిర్వహణపై మంత్రి అసంతృప్తి

- అధికారులపై మండిపాటు
- కుక్కల నియంత్రణ ఎక్కడ చేస్తున్నారని ప్రశ్న
- కొబ్బరి పీచు తయారీ యంత్రం నిరుపయోగంగా ఉండడంపై మండిపాటు



కంపోస్టు యార్డును పరిశీలిస్తున్న మంత్రి మనోహర్

తెనాలి టౌన్: స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని మున్సిపల్ కంపోస్టు యార్డు నిర్వహణపై రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం కంపోస్టు యార్డును ఆయన అధికారులతో కలసి పరిశీలించారు. ముందుగా యార్డులోని వ్యర్థాలను తొలగించే ప్రక్రియను పరిశీలించి పనులు నత్తనడకన సాగడాన్ని గుర్తించి సదరు కాంట్రాక్టర్‌పై మండిపడ్డారు. నెలాఖరులోగా డంపింగ్ యార్డులోని చెత్త మొత్తం తరలించాలని ఆదేశించారు. అనంతరం కొబ్బరిబొండాల నుంచి పీచు తయారీ యంత్రం వద్దకు వెళ్లారు. గత ఆరు నెలలుగా యంత్ర సేవలు నిరుపయోగంగా ఉన్నాయని అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. పట్టణంలోని రోడ్ల వెంట ఇష్టారాజ్యంగా కొబ్బరి బొండాలు పడి ఉండటాన్ని తాను చూశానని, మీరంతా ఏమి చేస్తున్నారు అని కమిషనర్, హెల్త్ ఆఫీసర్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనితీరు మార్చుకోవాలని అధికారులను హెచ్చరించారు. డంపింగ్‌యార్డు నుంచి వస్తున్న కలుషిత నీరు పక్క పొలాల్లోకి వెళ్లడాన్ని గుర్తించి సత్వరం మూడు అడుగుల మేర చుట్టూరా గుంట తీసి వ్యర్థపు నీరు రైతుల పొలాల్లోకి వెళ్ళకుండా చర్యలు చేపట్టాలని అధికారులనుఆదేశించారు.

కుక్కల బెడద రూపుమాపాలి..

వీధి కుక్కల సంతానోత్పత్తి నియంత్రణ కేంద్రాన్ని మంత్రి నాదెండ్ల మనోహర్ సందర్శించారు. పట్టణంలో కుక్కల బెడద అధికంగా ఉందని, నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు శూన్యమని హెల్త్ ఆఫీసర్‌ను ప్రశ్నించారు. ప్రతి రోజు తెనాలి జిల్లా వైద్యశాలకు కుక్క కరిచిందని బాధితులు వస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. అలసత్వం వీడి కుక్కల బెడద రూపుమాపాలని సూచించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ పట్టణంలో సరైన రీతిలో చెత్త సేకరణ జరగడం లేదని తెలిపారు. రూ.3.20 కోట్ల నిధులతో డంపింగ్‌యార్డులోని వ్యర్థాలను తొలగిస్తున్నట్లు తెలియజేశారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ బండి శేషన్న, హెల్త్ ఆఫీసర్ హెలెన్ నిర్మల, రెవెన్యూ ఆఫీసర్ రాంప్రసాద్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

రైతుల ఆవేదన

కంపోస్టు యార్డు చుట్టూరా దాదాపు15 ఎకరాల మేర పంటలు పండక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యార్డు నుంచి వచ్చే వ్యర్థపు నీరు పంట పొలాల్లోకి చేరడం వల్ల పైరు నాటిన కొద్ది రోజులకే పాడైపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 10 సంవత్సరాల నుంచి ఇదే పరిస్థితి కొనసాగుతున్నట్లు తెలియజేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులకు ఎన్నిమార్లు విజ్ఞప్తి చేసినా మొర ఆలకించడం లేదని గడ్డిపాటి ఉదయశంకర్ అనే రైతు ఆవేదన వ్యక్తం చేశారు. తనకు యార్డు తూర్పు భాగాన 4.50 ఎకరాల పొలం ఉందని, పొలంలో పంట పండించి దానిపై ఆదాయం చూసి సంవత్సరాలు గడిచిందని తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. ఇప్పుడైనా మంత్రి చెప్పిన విధంగా కంపోస్టు యార్డును ఇక్కడి నుంచి తరలిస్తే రాబోయే రోజుల్లోనైనా పంటలు పండించి దానిపై ఆదాయం చూడాలన్నా ఆశ ఉందని తెలిపారు.



గడ్డిపాటి ఉదయశంకర్, రైతు

హోరాహోరీగా అండర్-17 బాలుర వాలీబాల్ పోటీలు

సత్తెనపల్లి: పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయ 54వ హైదరాబాద్ రీజియన్ స్థాయి అండర్-17 బాలుర వాలీబాల్ పోటీలు శనివారం హోరాహోరీగా ప్రారంభమయ్యాయి. పల్నాడు జిల్లా సత్తెనపల్లి (రామకృష్ణాపురం)లోని పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయ ఆవరణలో అండర్ -17 బాలుర వాలీబాల్ పోటీలు లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో నిర్వహించారు. పోటీల్లో క్రీడాకారులు నువ్వా .. నేనా అన్నట్లు తలపడ్డారు. పోటీలకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి మొత్తం 18 జట్లు హాజరయ్యాయి. శనివారం రాత్రి ఫ్లడ్‌లైట్ల వెలుగులో కూడా పోటీలు కొనసాగించారు. ఎనిమిది జట్లు ఖమ్మం, సత్తెనపల్లి, హకీంపేట్, విజయవాడ-1, తెనాలి, వెంకటగిరి, వాల్తేరు, కర్నూల్ జట్లు క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నాయి. ఆదివారం క్వార్టర్ ఫైనల్, సెమీఫైనల్, ఫైనల్ పోటీలు నిర్వహించి విజేతలను ప్రకటించనున్నారు. అనంతరం విజేతలకు బహుమతుల ప్రధానోత్సవం చేపడుతామని పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయ సత్తెనపల్లి ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ బి.కిరణ్‌రెడ్డి తెలిపారు. పంజాబ్‌లో జరిగే జాతీయస్థాయి వాలీబాల్ జట్టును కూడా ఇక్కడ ఎంపిక చేయనున్నారు.

అలరించిన 'మహా మంజీరనాదం'





నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో అన్నమయ్య కళావేదికపై శ్రీసాయి మంజీర కూచిపూడి ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో 15వ అంతర్జాతీయ నృత్య దినోత్సవంలో భాగంగా మహామంజీర నాదం-2025 శనివారం కొనసాగాయి. పాలక మండలి సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేయగా, సంస్థ అధ్యక్షుడు డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. అనంతరం సుమంగళ ప్రభు (కర్ణాటక) భరతనాట్యం, దేబ్‌జనిబసు (కలకత్తా) కథక్, జెపీ కనిష్క (హైదరాబాద్), కూచిపూడి నృత్యం సభికులను అలరించాయి. కళాకారులను సంస్థ కార్యదర్శి డాక్టర్ కాజ వెంకటసుబ్రహ్మణ్యం కళాకారులను యువ కళారత్న పురస్కారాలతో సత్కరించారు. కార్యక్రమంలో వీవీఐటీ విశ్వ విద్యాలయం చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, ప్రముఖ ఆడిటర్ రామరాజు శ్రీనివాసరావు, పచ్చల నాగమహిత, వెంకటగిరి నాగలక్ష్మి పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణం పశువుల హాస్పిటల్ బ్రిడ్జి సమీపంలో బకింగ్‌హామ్ కెనాల్‌లో నీటిలో తేలియాడుతున్న మహిళ మృతదేహాన్ని స్థానికులు శనివారం గుర్తించారు. తాడేపల్లి పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి నీటిలో తేలియాడుతున్న మృతదేహాన్ని బయటకు తీసి పరిశీలించారు. ఆమె వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. మృతిచెందిన మహిళకు సుమారు 60 సంవత్సరాలు ఉండవచ్చని, శరీరం నిండా తెల్లమచ్చలు (బొల్లి) ఉన్నాయని, శరీరంపై గోల్డ్ కలర్ చీర, రెడ్ కలర్‌లో దుస్తులు, ఎర్ర జాకెట్‌పై గోల్డ్ కలర్ బోర్డరు కలిగి ఉందని, ఈ మృతదేహాన్ని ఎవరైనా గుర్తిస్తే 08645272186కు సమాచారం ఇవ్వాలని తాడేపల్లి పోలీసులు కోరారు.

జంతు సంరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి



మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు మెడికల్: ప్రజల జీవన విధానంలో భాగమైన జంతువులకు అత్యున్నత స్థాయి సంరక్షణను అందించటంలో పశువైద్యులతో పాటు, ప్రతి ఒక్కరి బాధ్యత ఉందని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అన్నారు. శనివారం స్థానిక కొత్తపేటలోని జిల్లా పశువైద్యశాలలో జరిగిన ప్రపంచ పశువైద్య దినోత్సవం - 2025లో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. పశువుల ఆరోగ్యం ప్రజల ఆరోగ్యంతో అనుసంధానమై ఉందని చెప్పారు. తన తండ్రి వెటర్నరీ డాక్టర్‌గా మధురై పరిసర ప్రాంతంలో సేవలు అందించారని కలెక్టర్ గుర్తు చేసుకున్నారు. పశువైద్యంతో తమ కుటుంబానికి ప్రత్యేకమైన అనుబంధం ఉందన్నారు. ఇక్కడ కూడా పశువైద్య సేవలు బాగా అందుతున్నాయని కొనియాడారు. గ్రామంలో పశుసంపద వల్ల ప్రజల జీవనోపాధి మెరుగు పడుతుందన్నారు. పట్టణవాసులు సైతం పెంపుడు జంతువుల పెంపకంపై ఇష్టం చూపుతున్నారన్నారు. పెంపుడు జంతువులతో పాటు వీధి కుక్కలు, పిల్లుల సంరక్షణకు ప్రజలు తమ వంతు సహకారం అందించాలన్నారు. ప్రభుత్వ పశు వైద్యశాలలో జంతువులకు నాణ్యమైన వైద్యసేవలను అందిస్తున్నారన్నారు. జంతువుల ఆరోగ్య సంరక్షణలో నిరంతరం కృషి చేస్తున్న పశువైద్యులకు, వెటర్నీ పారమెడికల్ సిబ్బందికి, జంతు ప్రేమికులకు, స్వచ్ఛంద సేవ సంస్థలకు అంతర్జాతీయ పశువైద్య దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. పశు సంవర్ధక శాఖ జిల్లా సంయుక్త సంచాలకులు డాక్టర్ ఒ.నరసింహారావు మాట్లాడుతూ నూతన పశువైద్యశాల భవనాలకు జిల్లా కలెక్టర్ రూ.14 లక్షలను కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద మంజూరు చేయించడం పశు వైద్యులందరికీ ఆనందదాయకమన్నారు. అనంతరం కలెక్టర్‌ను ఘనంగా సన్మానించారు. ప్రపంచ పశువైద్య దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. వివిధ రంగాలలో నిష్ణాతులైన విశ్రాంత పశువైద్యులు డాక్టర్. డి.రజనీకాంత్, డాక్టర్.ఆర్. లక్ష్మీప్రసాద్‌లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డెప్యూటీ డైరెక్టర్లు డాక్టర్ కె.వి.వి.సత్యనారాయణ, డాక్టర్. ఎం.రత్నజ్యోతి, రాష్ట్ర వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ డాక్టర్ వై.ఈశ్వర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎం.వెంకటేశ్వర్లు, ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కె.సాంబశివరావు, జిల్లా పశు వైద్య వైద్యులు పాల్గొన్నారు.

గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో తెనాలి అక్కాచెల్లెలు



నయనశ్రీకి సర్టిఫికెట్ ప్రదానం



మోనికకు సర్టిఫికెట్ ప్రదానం

తెనాలి: పట్టణానికి చెందిన అక్కాచెల్లెళ్లు యండ్రపాటి నయనశ్రీ, యండ్రపాటి మోనిక గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించారు. గతేడాది డిసెంబరు ఒకటిన హలెల్ మ్యూజిక్ స్కూల్ ద్వారా ప్రపంచస్థాయిలో 18 దేశాల నుంచి 1100 మంది విద్యార్థులు సంగీత ప్రదర్శనలో పాల్గొన్నారు. కీ బోర్డు వాయిద్యంతో ఇచ్చిన ప్రదర్శనలో నయనశ్రీ, మోనికతో పాటు మొత్తం 1046 మందిని ఎంపికచేసి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో నమోదు చేశారు. విజయవాడలోని మెట్రోపాలిటన్ చర్చిలో శుక్రవారం జరిగిన అభినందన సభలో మ్యూజిక్ స్కూల్ నిర్వాహకుడు అగస్టీన్ దండింగ చేతుల మీదుగా వీరిరువురు గిన్నిస్ సర్టిఫికెట్, జ్ఞాపికను అందుకున్నారు. వీరి తల్లిదండ్రులు యండ్రపాటి రత్నం, సువర్ణ దంపతులు.

కీబోర్డ్ ప్లేలో గిన్నిస్ రికార్డు

గుంటూరు రూరల్: తమ కళాశాల విద్యార్థులు విద్యతోపాటుగా అన్నిరంగాల్లో ప్రావీణ్యతను పెంపొందించేందుకు అన్నివిధాలుగా తమ కళాశాల సౌకర్యాలను కల్పిస్తుందని విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాధిక తెలిపారు. శనివారం పెదపలకలూరురోడ్డులోని కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థిని వై.నయనశ్రీ కీబోర్డ్ ప్లేలో గిన్నిస్ రికార్డు సాధించినట్లు తెలిపారు. హాల్లెల్ మ్యూజిక్ స్కూల్ ఆధ్వర్యంలో గత డిసెంబరు 15వ తేదీన ఆన్‌లైన్ మాధ్యమంలో పోటీ నిర్వహించగా 18 దేశాలకు చెందిన పియానో వాయిద్యకారులు పాల్గొన్నారని, వారిలో కుమారి నయనశ్రీ కేవలం 41 సెకండ్లలో మూడు సరళీ స్వరాలు వాయించినందుకు ఈ అరుదైన రికార్డు లభించినట్లు తెలిపారు. ఈమేరకు ఫలితాలు వెల్లడి చేసి ఈనెల 25వ తేదీన గిన్నిస్ రికార్డు పత్రాన్ని విద్యార్థినికి పంపించారన్నారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, డాక్టర్ జి.సంధ్య, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

ఉత్కంఠగా ఎడ్ల బండలాగుడు పోటీలు

దాచేపల్లి: దాచేపల్లిలోని శ్రీ వీర్ల అంకమ్మతల్లి ఆలయ తిరునాళ్ల సందర్భంగా రాష్ట్ర స్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు శనివారం హోరాహోరీగా సాగాయి. పాలపళ్ల విభాగంలో పల్నాడు జిల్లా అమరావతి మండలం జిడుగు గ్రామానికి చెందిన బీఎస్‌ఆర్ బుల్ భూపతి శ్రీనివాస్, నూసాయిపేటకి చెందిన గౌరు కార్తికేయ సంయుక్త ఎడ్ల జత 4,250 అడుగుల దూరం బండ లాగి విజేతగా నిలిచాయి. పల్నాడు జిల్లా మాచవరం మండలం మోర్జంపాడుకు చెందిన కుర్రి గంగరాజు యాదవ్ ఎడ్ల జత 3,609 అడుగుల దూరం బండలాగి రెండో స్థానం, ఫిరంగిపురం మండలం కండ్రిక గ్రామానికి చెందిన కేలం పద్మనాయుడు ఎడ్లజత 3,580 అడుగుల దూరం బండలాగి మూడోస్థానం, బాపట్ల మండలం పాండురంగాపురానికి చెందిన కె. ఏడుకొండలురెడ్డి ఎడ్లజత 3,500 అడుగుల దూరం బండలాగి నాల్గవ స్థానం, ముప్పాళ్ల మండలం మాదల గ్రామానికి చెందిన యర్రంశెట్టి సుబ్బారావు ఎడ్ల జత 3,369 అడుగుల దూరం బండలాగి ఐదవ స్థానం, దాచేపల్లికి చెందిన యామర్తి శైలేంద్ర ఎడ్లజత 3,103 అడుగుల దూరం బండలాగి ఆరవ స్థానం, సూర్యాపేటకి చెందిన సురేష్, మాచవరం మండలం మల్లవోలుకి చెందిన దొప్పలపూడి మహిమ మణిరత్నం సంయుక్త ఎడ్లజత 2,800 అడుగుల దూరం బండలాగి ఏడవ స్థానంలో నిలిచాయి. విజేతలకు వరుసగా రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ. 8 వేలు, రూ.7 వేలు, రూ.5 వేలు, రూ. 3వేలు చొప్పున నగదు, షీల్డ్స్‌ని బహూకరించారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతగా గూడా శ్రీనివాసరావు వ్యవహరించారు. కమిటీ సభ్యులు కొప్పుల గిరి, అనిశెట్టి శ్రీనివాసరావు, యలమల నరేష్ తదితరులు పోటీలు పర్యవేక్షించారు.

● విజయ పథం





● సోలార్ పవర్‌తో జీవితాల్లో కొత్త వెలుగు

సోలార్ సఖి

రైల్లో తొలిసారి ప్రయాణించిన ఆ మహిళలు.... 'రైలు ప్రయాణం ఇంత బాగుంటుందా!' అని సంబరపడి పోయారు. ఆ తరువాత మరో ప్రయాణం మొదలు పెట్టారు. అయితే అది రైలు ప్రయాణం కాదు. తమ జీవితాలను మార్చివేసిన ప్రయాణం. చిన్న చదువులు చదువుకున్న ఎంతో మంది గ్రామీణ మహిళలు సోలార్ ఇంజినీర్‌లుగా, ఎంటర్‌ప్రెన్యూర్స్‌గా రాణిస్తున్నారు...



● సోలార్ సఖి: భవిష్యత్ తరానికి మార్గదర్శనం

రాజస్థాన్‌లో నిశ్చలగఢ్‌కు చెందిన తప్రీదేవి ఎన్నో సంవత్సరాలు విద్యుత్ సౌకర్యం లేని ఇంట్లోనే గడిపింది. అయిదవ తరగతి తరువాత తల్లిదండ్రులు చదువు మాన్పించడంతో ఇంటి పనులు చేసేది. గొర్రెలు మేపేది. ఇల్లే ప్రపంచంగా బతుకుతున్న తప్రీ దేవి జీవితాన్ని 'సోలార్ పవర్' మార్చి వేసింది. హర్మదా(జైపూర్)లో ఐదు నెలల సోలార్ ఇంజినీరింగ్ శిక్షణ కార్యక్రమం ఆమె జీవితాన్ని కొత్త దారిలోకి తీసుకువెళ్లింది.

సోలార్ ఇంజినీరింగ్ శిక్షణ కోసం సిద్ధం అయినప్పుడు..

'ఎందుకులే' అన్నారు తల్లిదండ్రులు. వారిని బలవంతంగా ఒప్పించాల్సి వచ్చింది,

'మా కమ్యూనిటీలోని మహిళలు ఎప్పుడూ ముసుగు లేకుండా ఒంటరిగా బయటకు వెళ్లలేదు. నేను ఎప్పుడూ పట్టణ ప్రాంతానికి ఒంటరిగా వెళ్లలేదు' అంటుంది తప్రీదేవి.

కిషన్‌గడ్‌కు వెళ్లడం...తన తొలి రైలు ప్రయాణం! 'అది పూర్తిగా కొత్త అనుభవం. ప్రయాణంలోని ఆనందం తెలిసొచ్చింది' అంటుంది తప్రీదేవి.



● 'ఆది సేవా గౌరవ్ సమ్మాన్' అవార్డ్ అందుకున్న తప్రీదేవి

శిక్షణలో సోలార్ ఇన్‌స్టలేషన్, ఫీల్డ్‌వర్క్‌కు అవసరమైన నైపుణ్యాలు సంపాదించింది. ఆ తరువాత స్వగ్రామానికి తిరిగివచ్చింది. 'మేము చాలా సంవత్సరాలు చీకటిలో జీవించాము. అందుకే మా జీవితాల్లో వెలుగు తీసుకురావాలనుకున్నాను' అంటుంది తప్రీదేవి.

సోలార్ ఇంజినీర్‌గా కొత్త జీవితాన్ని ప్రారంభించిన తప్రీదేవి తన గ్రామానికి విద్యుత్ వెలుగులు తీసుకువచ్చింది. భారత రాష్ట్రపతి నుండి 'ఆది సేవా గౌరవ్ సమ్మాన్' అవార్డ్ అందుకుంది. ఇది కేవలం తప్రీదేవి విజయగాథ మాత్రమే కాదు... జార్ఖండ్, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, మిజోరాం, నాగాలాండ్‌తో సహా పదిరాష్ట్రాలలో మూడువేల మందికి పైగా గ్రామీణ మహిళా సోలార్ ఇంజినీర్‌ల విజయగాథ.

తమ గ్రామాల్లో సోలార్ ప్యానెళ్లను ఒంటి చేత్తో మరమ్మతు చేసే వీరు పారిశ్రామికవేత్తలుగా కూడా ఎదిగారు. ఈ మార్పుకు కారణం హర్ష్ తివారీ నేతృత్వంలోని ఈఎంపీఐ ఇంటర్నేషనల్. ఈ సంస్థ శిక్షణ కార్యక్రమాల ద్వారా గ్రామీణ ప్రాంత మహిళలు సోల్డరింగ్, వైరింగ్, బ్యాటరీ సెటప్, ఫాల్ట్ ఫైండింగ్, ఇన్‌స్టలేషన్‌లలో ప్రావీణ్యం సాధించారు. గ్రామీణ మహిళలకు సాంకేతిక నైపుణ్యం, ఆర్థికస్వాతంత్ర్యం లక్ష్యంగా ఈఎంపీఐ ఇంటర్నేషనల్ పనిచేస్తోంది.

శిక్షణ అనంతరం మహిళలు తమ గ్రామాల్లో సోలార్ సొల్యూషన్స్ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేస్తారు. మరమ్మతులు, ఫస్ట్‌లెవల్ చెకప్‌లు నిర్వహించేందుకు వీలుగా చిన్న ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తారు. గ్రామస్థాయి ఇంధన మౌలిక సదుపాయాలు సజావుగా సాగేలా చూస్తారు. శిక్షణ పూర్తయిన తరువాత క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న మహిళా సోలార్ ఇంజినీర్‌లను 'సోలార్ సఖీ' అని పిలుస్తారు.

'వ్యవసాయంతో పాటు చిన్న తరహా పరిశ్రమలలో సౌరశక్తితో నడిచే పరికరాలకు డిమాండ్ పెరుగుతుంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఈఎంపీఐ ఇంటర్నేషనల్ సోలార్ సఖీలకు శిక్షణ ఇస్తోంది. జీవనోపాధి కల్పిస్తుంది. టెక్నికల్ ట్రైనింగ్‌తోపాటు ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, కస్టమర్ ఎంగేజ్‌మెంట్‌లో కూడా శిక్షణ ఇస్తాం. గ్రామాల్లో సోలార్ సెటప్‌లలో ఏవైనా సాంకేతిక లోపాలు తలెత్తితే సోలార్ సఖులు పరిష్కారం చూపుతున్నారు' అంటున్నాడు హర్ష్ తివారీ.

కూల్ సమ్మర్

పక్షులను చల్లగా కాపాడుకుందాం!

వేసవి కాలం పక్షులకు కష్టకాలం. అధిక వేడి పక్షులకు ప్రమాదకరంగా మారుతుంది. డీహైడ్రేషన్, వడదెబ్బ బారిన పడకుండా పక్షులను రక్షించడానికి... నీరు, నీడ, గాలి ప్రసరణకు ప్రాముఖ్యత ఇవ్వాలి. కొన్ని జాగ్రత్తలు...





● పక్షులకు అన్ని వేళలా శుభ్రమైన మంచినీరు అందుబాటులో పెట్టాలి ● వేర్వేరు ప్రదేశాలలో వాటర్ బౌల్స్ పెట్టాలి ● చల్లగా, ఫ్రెష్‌గా ఉండడానికి వాటర్ బౌల్స్‌లో ఐస్ క్యూబ్స్ వేయవచ్చు ● చల్లని, సౌకర్యవంతమైన స్థలంలో పక్షులు ఉండేలా చూడాలి ● కూలింగ్ మ్యాట్స్ ఉపయోగించవచ్చు ● పక్షులపై ఒక నిమిషం లేదా అర నిమిషం నీటిని స్ప్రే చేయాలి ● పక్షులకు సమీపంలో తడి టవల్స్ ఏర్పాటు చేయాలి ●వేగంగా శ్వాస తీసుకోవడం, ఉక్కిరిబిక్కిరి కావడం, బద్ధకంగా కనిపించడం, తినడానికి ఆసక్తి చూపించకపోవడం...మొదలైనవి పక్షులకు సంబంధించి ఓవర్ హీటింగ్ లక్షణాలు. ఈ లక్షణాలు కనిపించిన వెంటనే తక్షణ జాగ్రత్తలు తీసుకోవాలి ● ఆహారం విషయానికి వస్తే.... నీటి శాతం ఎక్కువగా ఉన్న పుచ్చకాయ, దోసకాయలాంటివి అందించవచ్చు ● ఉత్తర్‌ప్రదేశ్‌లోని కొన్ని జిల్లాలలో వందలాది గ్రామాల్లో యానిమల్ యాక్టివిస్ట్‌లు వేసవి వేడి నుంచి పక్షులను కాపాడడానికి 'బర్డ్ రెస్టారెంట్స్' ఏర్పాటు చేశారు. పక్షులకు చల్లని నీడను ఇచ్చేలా నీరు, ఆహార పదార్థాలతో చెట్టు కొమ్మలపై ఈ రెస్టారెంట్‌లు ఏర్పాటు చేశారు.





● మానవత్వం

నిరీక్షణ ఫలించింది...



కొన్ని సంవత్సరాల నుంచి భర్తతో కలిసి మన దేశంలో ఉంటున్న క్రిస్టెన్ ఫిషర్ అనే అమెరికన్ భారత్‌లో తన అనుభవాలను ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో షేర్ చేస్తుంటుంది. దిల్లీలో ఉంటున్న ఫిషర్ దంపతులు నిషా అనే దివ్యాంగురాలైన బాలికను దత్తత తీసుకోవాలనుకున్నారు. అయితే దత్తత ప్రక్రియ సుదీర్ఘంగా కొనసాగింది.

'2023లో అక్టోబర్‌లో దత్తత కోసం దరఖాస్తు చేసుకోగా, 2024లో నిషాకు దగ్గరయ్యాం. 2025 ఏప్రిల్ నాటికి దత్తత పూర్తయింది. ఇప్పుడు నిషా మా అందమైన కుమార్తె' అని ఇన్‌స్టాగ్రామ్‌లో రాసింది ఫిషర్.

'కౌంటింగ్ డౌన్ ది డేస్ అన్‌టిల్...' ట్యాగ్‌లైన్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో పోస్ట్ చేసింది. ఈ వీడియోలో తాను దత్తత తీసుకున్న పాప కనిపిస్తుంది.

మరో వీడియోలో చిన్నారి నిషాకు సంబంధించిన ఎమోషనల్ గ్లింప్స్‌ను షేర్ చేసింది. దివ్యాంగురాలు అనే కారణంతో నిషాను చిన్న వయసులోనే తల్లిదండ్రులు వదిలేశారు. రెండు సంవత్సరాలు అనాథాశ్రమంలో పెరిగింది నిషా. 'స్పెషల్ నీడ్స్ చైల్డ్‌ను దత్తత తీసుకోవాలనుకోవడానికి కారణం...వారికి కొత్త జీవితం ఇవ్వాలనుకోవడం' అంటుంది క్రిస్టెన్ ఫిషర్.

● గుడ్ అండ్ బ్యాడ్

కిడ్‌ఫ్లూయెన్సర్... కిం కర్తవ్యం



యూ ట్యూబ్‌లో కిడ్‌ఫ్లూయెన్సర్‌ల వైరల్ వీడియోలు ప్రవాహంలా కనిపిస్తాయి. క్యాచీ కంటెంట్‌తో లక్షల్లో వ్యూస్ సాధిస్తున్నారు. లక్షల్లో సబ్‌స్క్రైబర్‌లు ఉన్నారు. మన దేశంలో కిడ్‌ఫ్లూయెన్సర్‌ల సంఖ్య అంతకంతకూ పెరిగిపోతుంది. అయితే దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

తెర వెనుక కథ గురించి చర్చ మొదలైంది. షూటింగ్‌ల కోసం వారు తరచుగా స్కూల్‌కు వెళ్లకుండా ఎక్కువ సెలవులు పెడుతున్నారా? సరిగా తింటున్నారా? తగినంత నిద్ర ఉంటోందా? కంటెంట్‌కు సంబంధించి ఒత్తిడికి గురవుతున్నారా? అందరు పిల్లల్లా సాధారణ జీవితాన్ని ఎంజాయ్ చేయలేకపోతున్నారా... ఇలాంటి సందేహాలు ఎన్నో ఉన్నాయి.

బాగా చదివే పిల్లలు కూడా 'కిడ్‌ఫ్లూయెన్సర్' ట్యాగ్‌లైన్ పుణ్యమా అని చదువులో వెనకబడిపోతున్నారు. 'నేను చాలా సాధించాను. నేను చాలా గ్రేట్' అనే భావన పెరిగిపోతుంది. 'యాభై ఏళ్ల క్రితం అకాడమిక్ ఎక్సలెన్స్ గోల్డ్ స్టాండర్డ్, ముప్ఫై ఏళ్ల క్రితం ఆటలు ఉండేవి. ఇప్పుడు క్రియేటివిటీ, డ్యాన్స్, మ్యూజిక్, విజువల్ కంటెంట్. ఒక్క వైరల్ వీడియో చాలు పిల్లలకు రాత్రికి రాత్రి స్టార్‌డమ్ తీసుకురావడానికి. ఈ తక్షణ పాపులారిటీ వల్లే పిల్లలు, తల్లిదండ్రులు వైరల్ కంటెంట్‌పై దృష్టి పెడుతున్నారు' అంటుంది కౌన్సెలింగ్ సైకాలజిస్ట్ డా.మేఘా పుష్కర్ణ.

హెల్త్

● టూత్

ఇంటి పట్టున ఉంటారు

పంటి పని పట్టండి...... జంకొద్దు



ఎముకలు పెరుగుతున్న కొద్దీ వచ్చే మార్పులు స్వాభావికమైనవి. అయితే ఎదిగే వయసులో ఉన్న కొందరు చిన్నారులు అలవాటుగా తమ వేలిని నోట్లో పెట్టుకుని థంబ్ సకింగ్ చేస్తుంటారు. ఇది నివారించాల్సిన విషయమే అయినప్పటికీ... పిల్లల సైకలాజికల్ ఎదుగుదల దృష్టితో చూస్తే వారి ఈ అలవాటును బలవంతంగా మాన్పకూడదనీ, క్రమంగా మాన్పించాలని నిపుణులు పేర్కొంటుంటారు. ఇలా ఎముకల పెరుగుదలతో వచ్చే మార్పులతోనూ, నోట్లో వేలుపెట్టుకునే అలవాటు వల్లా పలువరస షేప్ మారవచ్చు.

పిల్లలు ఎదుగుతూ ఉండే సమయంలో అన్ని ఎముకలతో పాటు ముఖానికి సంబంధించిన ఎముకలూ, దవడ ఎముకల్లోనూ మార్పులు వస్తుంటాయి. దాంతో చిన్నారుల్లో ఈ ఎదుగుదలకు సంబంధించిన కొన్ని సమస్యలు కనిపించవచ్చు. అలాగే చిన్నపిల్లలు చాక్లెట్లు, స్వీట్స్, జంక్‌ఫుడ్ వంటివి ఇష్టంగా తింటుంటారు. వేసవిలో కూల్‌డ్రింక్స్ తాగుతుంటారు. ఇవన్నీ నోటి ఆరోగ్యాన్ని దెబ్బతీసేవే. పిల్లల్లో వచ్చే కొన్ని సాధారణ డెంటల్ సమస్యలూ, వాటికి పరిష్కారాల కోసం ఈ కథనం.

కొన్ని సాధారణ దంతసమస్యలివి...

● పిప్పిపళ్లు ● చిగుర్ల సమస్యలు ● పాలపళ్లు సరైన సమయంలో ఊడకపోవడం ● ఎత్తు పళ్లు, ఎగుడుదిగుడు పళ్లు, పళ్ల మధ్య సందులతో సమస్యలు ● ముఖానికి దెబ్బలు తగలడం వల్ల వచ్చే సమస్యలు.

పిప్పిపళ్లు...

దాదాపు 80 శాతానికిపైగా పిల్లల్లో పిప్పిపళ్లు, చిగుర్ల జబ్బులు కనిపిస్తుంటాయి. తీపి పదార్థాల ముక్కలు నోటిలోనే ఉండిపోవడంతో పెరిగిపోయిన బాక్టీరియాతో పాటు వారు సరిగా బ్రష్ చేసుకోకపోవడం వల్ల ఆ పెరిగిన బ్యాక్టీరియా ఎక్కువ సంఖ్యలో నోటిలోనే ఉండిపోవడం, అవి విడుదల చేసే హానికర రసాయనాల వల్ల పళ్లలో రంధ్రాలు ఏర్పడి పిప్పిపళ్లు రావచ్చు. రంధ్రాల పరిమాణం పెరుగుతున్న కొద్దీ ఆహార వ్యర్థాలు అక్కడ ఎక్కువగా ఇరుక్కుపోవడం, దాంతో రంధ్రం మరింతగా పెరగడంతో పాటు ఇన్ఫెక్షన్స్ వచ్చి నొప్పి రావచ్చు. ఇలాంటి పిప్పిపళ్ల కారణంగా చిన్నారులు ఆహారం నమలడానికి ఇబ్బందిపడతారు. అన్నం తినడాన్ని అవాయిడ్ చేయడానికి ప్రయత్నిస్తుంటారు. తమకు వచ్చే నొప్పిని తల్లిదండ్రులకు సరిగా చెప్పలేక ఇలా అన్నం తినడానికి నిరాకరిస్తుంటారు. దాంతో ఎదుగుదల కూడా ఎంతో కొంత ప్రభావితం కావచ్చు.



చికిత్స...

పిప్పిపళ్లకు సరైన సమయంలో చికిత్స చేయించకపోతే ఇన్ఫెక్షన్ పంటి ఎముక వరకు చేరి, పాల పళ్లతో పాటు తర్వాత రావాల్సిన శాశ్వతదంతాలూ పాడయ్యే ముప్పు పొంచి ఉంటుంది. ఇలాంటి పిల్లలను దంతవైద్యులకు చూపించినప్పుడు వారు పంటిలోని రంధ్రాలను పూడ్చివేయడం, ఇన్ఫెక్షన్‌ను తగ్గించడానికి తగిన యాంటీబయాటిక్స్ ఇవ్వడం వంటి చికిత్సలు చేస్తారు.

చిగుర్ల జబ్బులు...

చిన్నారులకు బ్రషింగ్ నైపుణ్యాలు అంతగా తెలియకపోవడంతో పళ్లలో చిక్కుకున్న ఆహారపదార్థాలను సరిగా శుభ్రం చేసుకోకపోవడం కారణంగా పిప్పిపళ్లతో పాటు చిగుర్ల సమస్యలు వచ్చే ముప్పూ ఉంటుంది. దీనికో కారణముంది. నోట్లో విపరీతంగా పెరిగిపోయిన బ్యాక్టీరియా, ఆహారపదార్థాలతో కలిసి ప్లాక్, క్యాలికులస్ అని పిలిచే మురికి సున్నితమైన చిగుర్ల చివర్లలోకి చేరుతుంది. ఈ మురికి కారణంగా చిగుర్లలో వాపు, కొందరిలో చిగుర్ల నుంచి రక్తస్రావం కావడం, నోటి దుర్వాసన వంటి సమస్యలు కూడా రావచ్చు. చిన్నవయసులోనే చిగుర్ల జబ్బు వస్తే పిల్లలు జీవితకాలం దృఢమైన పళ్లు లేక ఇబ్బంది పడవలసి రావచ్చు.

చికిత్స...

జింజివైటిస్ వంటి సమస్యలకు తగిన యాంటీబయాటిక్స్ వాడటంతో పాటు చిగుర్లకు వచ్చే సమస్యను బట్టి దంతవైద్యులు పలు రకాల చికిత్సలు అందిస్తారు.

ఎత్తుపళ్లు, ఎగుడుదిగుడు పళ్లు / వంకరపళ్ల వంటి సమస్యలు...

ఎత్తుపళ్లు అన్నది పిల్లలను ఆత్మన్యూనతకు గురిచేసే సమస్య. మొదట్లో ఇది నివారించదగిన సమస్యే అయినప్పటికీ, తల్లిదండ్రుల అవగాహనాలోపం, మరి కొందరిలో వారి నిర్లక్ష్యం వల్ల ఇది తీవ్రమవుతుంది.

ఎత్తుపళ్లు / ఎగుడుదిగుడు పళ్లు / వంకర పళ్లకు కారణాలు...

● ఎత్తుపళ్లు చాలావరకు వంశపారంపర్యంగా వస్తుంటాయి. తల్లిదండ్రుల్లో ఒకరికిగానీ లేదా ఇద్దరికీ ఎత్తుపళ్లు ఉంటే పిల్లల్లోనూ వచ్చే అవకాశాలు 70 శాతానికి పైమాటే. పిల్లలకు ఎత్తుపళ్లు, ఎగుడుదిగుడు / వంకరపళ్లు, పళ్లమధ్య సందులు రాకుండా చేసే చికిత్సలు సైతం ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి.

● నోట్లో వేలుపెట్టుకోవడం, పెదవులు కొరకడం, నాలుకతో పళ్లను ముందుకు తోస్తూ ఉండటం, నోటితోనే గాలిపీల్చడం వంటి అంశాలూ ఎత్తుపళ్లకు కారణమవుతుంటాయి. ఎదుగుతున్న చిన్నారుల దవడ ఎముకలు మైనంలా ఒత్తిడి పడుతున్న దిశకు వంగిపోతుంటాయి. ఈ కారణం వల్లనే ఇక్కడ పేర్కొన్న దురలవాట్లు ఉన్న పిల్లల్లో దవడ ఎముకల షేపు మారిపోయి పళ్లు ఎత్తుగా రావచ్చు.

● పాలపళ్లు సమయానికి ఊడిపోకపోయినా, పిప్పిపళ్లను ముందే తీసేయాల్సి వచ్చినా ఎత్తుపళ్లు లేదా ఎత్తు పళ్లు, ఎగుడుదిగుడు పళ్లు రావడానికి ఈ అంశాలు కూడా ఒక కారణం.

ఎదిగే వయసులోనే ఎత్తుపళ్లను, ఎగుడుదిగుడు దంతాలనూ, సరిచేయడం, పళ్ల మధ్యన ఉండే సందులు చక్కదిద్దడం చాలా సులువు. చికిత్స ఫలితాలు కూడా దాదాపు నూరు శాతం ఉంటాయి. ఎదిగే వయసులో వచ్చే 'గ్రోత్ స్పర్' అనేది చికిత్సకు ఎంతగానో ఉపయోగపడుతుంది. చికిత్స త్వరగా, సమర్థంగా జరిగేందుకు ఈ గ్రోత్ స్పర్ అంశం సహాయపడుతుంది.



డా. వికాస్ గౌడ్,
డెంటల్ సర్జన్ అండ్ ఇంప్లాంట్ స్పెషలిస్ట్

ఎత్తుపళ్ల సమస్య రెండు రకాలుగా ఉండవచ్చు...

● కేవలం పళ్లు మాత్రమే ఎత్తుగా ఉండటం ● పళ్లతో పాటు దవడ ఎముకలు కూడా ఎత్తుగా ఉండటం.

పిల్లలు నవ్వినప్పుడు చిగుర్లు ఎక్కువగా కనిపించడం, నిద్రపోతున్నప్పుడూ పెదవులు తెరచుకునే ఉండటం, పెదవులు ముందుకు వచ్చినట్లుగా కనపడటం వంటివి ఎముక కూడా ఎత్తు పెరిగిందని చెప్పడానికి గుర్తులు.

చికిత్స...

● ఎదిగే వయసులో ఎత్తుగా ఉన్నట్లు గుర్తిస్తే... ఎలాంటి శస్త్ర చికిత్సలూ లేకుండానే పళ్లు, దవడలను ప్రత్యేకమైన క్లిప్స్‌తో సరిచేయవచ్చు. అయితే... ఎదిగిన పిల్లల్లో దవడ ఎముకలు ఎత్తుగా ఉంటే సర్జరీ చేయాల్సి రావచ్చు.



● పళ్లు ఎత్తుగా ఉన్నా, పళ్ల మధ్య సందులు ఉన్నా, వంకర టింకరగా ఉన్నా, ఎగుడుదిగుడుగా ఉన్నా క్లిప్పులతో వాటిని సరిచేయవచ్చు. అయితే పిల్లలకు అమర్చాల్సిన క్లిప్పులు అందరిలో ఒకేలా ఉండవు. వ్యక్తిగతమైన పరీక్షల తర్వాతే వారికి సరిపోయేవాటిని నిర్ణయించాల్సి ఉంటుంది.

పాలపళ్లు సరైన టైమ్‌లో ఊడకపోవడం...

సాధారణంగా పాలపళ్లలోని ప్రతి పన్నూ ఓ నిర్దిష్ట సమయం తర్వాత ఊడుతుంది. శాశ్వత దంతం తయారై బయటకు రావడానికి సిద్ధంగా ఉన్నప్పుడే పాలపన్ను ఊడుతుంది. ఊడిన 3 నుంచి 4 నెలల్లో శాశ్వత దంతం వచ్చేస్తుంది.

ఏ కారణం వల్లనైనా పాలపన్ను ఊడకపోతే, దానికి ముందువైపో, వెనకవైపు నుంచో శాశ్వత దంతం వస్తుంది. (కొన్నిసార్లు పాల పన్ను ఊడకపోవడం వల్ల శాశ్వత దంతం బయటకు రాలేక చిగురులోనే చిక్కుకుపోవచ్చు కూడా). దాంతో రెండు వరసల్లో పళ్లు కనపడతాయి. అందుకే ఆరేళ్లు దాటిన పిల్లలను దంతనిపుణులకు తరచూ చూపిస్తూ పాలపళ్లు సరైన సమయంలోనే పడిపోతున్నాయా లేదా అని పరీక్ష చేయిస్తూ ఉండాలి. అవసరాన్ని బట్టి వారి పర్యవేక్షణలో చికిత్స చేయించాలి.

పరీక్షలు : ఎక్స్-రే సహాయంతో పాలపళ్లు, శాశ్వత దంతాలను, శాశ్వతదంతాలను చిక్కుకుపోయిన తీరును దంతవైద్యులు తెలుసుకోగలరు.

ముఖానికి దెబ్బలు తగలడం వల్ల...

ఎదిగే పిల్లలు ఆటలాడుతుంటారు. పైగా ఇవి సెలవురోజులు కావడం ఆడుకోవడం మరింత ఎక్కువ. ఆటల్లో పరుగెత్తుతూ పడిపోవడం, దెబ్బలు తగలడం, క్రికెట్ బంతి లేదా ఇతర బంతుల వంటివి తగలడం, పిల్లలు పోట్లాడుకోవడం వంటి చర్యలతో ముఖానికి దెబ్బలు తగలడం, పళ్లు విరగడం / వంగిపోవడం, దెబ్బలు తీవ్రమైనవైతే పెదవులు చీలడం, ముక్కు వంకర కావడం కూడా జరగవచ్చు.

ఇలా దెబ్బలు తగిలినప్పుడు వెంటనే చికిత్స చేయించాలి. నిర్లక్ష్యం చేస్తే పలువరస షేపు మారడం, పళ్లపై గుర్తులు ఏర్పడి అలాగే ఉండిపోవడం జరగవచ్చు. అందుకే పన్ను విరిగినా, ఊడినా వెంటనే ఆ ముక్కను పాలలో లేదా మంచినీళ్లలో ఉంచి దంతవైద్యులను కలవాలి.

వేసవి సెలవులు దంతవైద్యం చేయించడానికి అనువైన సమయం. ఈ సమయంలో స్కూళ్లకు సెలవులు ఉంటాయి కాబట్టి పిల్లల చదువులు వృథా కాకుండానే చికిత్స చేయించవచ్చు. పైగా చికిత్స తర్వాత వారు ఇంటిపట్టునే ఉంటారు కాబట్టి టైముకు మందులు ఇవ్వడానికి, తగిన జాగ్రత్తలు తీసుకోడానికి, పిల్లలకు తగినంత విశ్రాంతి ఇవ్వడానికి సెలవులన్నవి సరైన సమయం. కాబట్టి తల్లిదండ్రులు ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకుని, పంటి సమస్యలున్న పిల్లలకు తగిన వైద్యసహాయం అందించవచ్చు.

● ఫుడ్

వేసవిలో పిల్లలకు ఆహారం ఇవ్వాలంటే రెండు అంశాలు గుర్తుపెట్టుకోవాలి. మొదటిది వేసవి వేడిమి. రెండోది సెలవుల్లో వాళ్ల ఆటలు. నగరాల్లోని పిల్లలు ఎండల్లో పెద్దగా ఆడే అవకాశం లేకపోయినా పట్టణాల్లో, పల్లెల్లోని పిల్లలు ఇలా ఎండ వేడిమిలో ఆడటం మామూలే. అలాగే పెద్ద నగరాల్లోంచి సెలవులకు పల్లెలకు వచ్చే పిల్లల సంఖ్య తగ్గినప్పటికీ... కొంతమంది ఇప్పటికీ ఇలా వచ్చేవారు లేకపోలేదు. ఇలా వేసవిలోని వేడిమిని తట్టుకుంటూ... ఎక్కువ సమయం ఆటలకు ఇచ్చుకుంటూ ఉండేందుకు అవసరమైన శక్తిని సమకూరుస్తూ ఉండటానికి చిన్నారులకు ఎలాంటి ఆహారం ఇవ్వాలో తెలిపే కథనం.



● అధిక శక్తికోసం పాల ఉత్పత్తులు...

పిల్లలకు తాజా లస్సీ, తాజా మజ్జిగ, ఫ్లేవర్డ్ మిల్క్, ఫ్రూట్ మిల్క్ షేక్‌లు (మ్యాంగో మిల్క్ షేక్) వంటివి ఇవ్వడం వల్ల ఒకపక్క అవి ద్రవాహారాలుగా వారు కోల్పోయే నీరు లవణాలను భర్తీ చేయడంతో పాటు ప్రొటీన్లనూ అందజేస్తాయి. ఎదిగే వయసులో ఎముకల బలం కోసం క్యాల్షియమ్‌ను ఇస్తాయి.

● తాజా పండ్లు... పిల్లలకు తాజా పండ్లు తినిపించడం ఎప్పుడూ మంచిదే. కాకపోతే పండ్ల రసాలకు బదులు వీలైనంతగా పండ్లను కొరికి తినేలా చూడాలి. ద్రవాలను భర్తీ చేయడం కోసం, వేసవి ఉపశమనం కోసం అప్పుడప్పుడూ చల్లగా ఉండే తాజా పండ్ల రసాలనూ ఇవ్వవచ్చుగానీ... వీలైనంత వరకు వాటిలో చక్కెర కలపకపోవడం మంచిది.

● జంక్‌ఫుడ్ వద్దు... బర్గర్‌లు, పిజ్జాలు, చిప్స్ వంటి వాటి కోసం వాళ్లు మారాం చేస్తున్నప్పటికీ ఆరోగ్యానికి అవి హానికరమంటూ వాళ్లను సముదాయించడం మంచిది. ఆ వయసు పిల్లలను సమాధానపరచడం కష్టం కాబట్టి వాటిలో పనీర్, తాజాకూరగాయలు పుష్కలంగా నింపి ఇవ్వడం మంచిది. అయితే వాటిల్లో చీజ్ ఎక్కువగా ఉన్నవాటిని తినిపించడం అంతగా మంచిది కాదు. మరీ మారాం చేస్తుంటే గ్రిల్డ్ వెజిటబుల్స్‌ను పనీర్‌తో కలిపి ఇవ్వవచ్చు.



● ఐస్‌క్రీముల విషయంలో...

వేసవిలో ఐస్‌క్రీములు అడగని పిల్లలు ఉండరు. ఇంట్లో తయారు చేసిన ఐస్‌క్రీమ్‌లు, ఫ్రూట్ కస్టర్డ్స్, పుడింగ్స్, స్మూతీస్ వంటివి పిల్లలకి పెట్టవచ్చు. ఇవి ఆరోగ్యకరమే. ఇక కూల్‌డ్రింక్స్ కోసమూ డిమాండ్ ఎక్కువగానే ఉండవచ్చుగానీ వాటిని ఇవ్వడం అంతమంచిది కాదని గుర్తుంచుకోండి